తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
18 ఏప్రిల్ 2026
పేజీలు : 08



Follow :

## వెళ్లింది.. డాటా ఏంట్రీ ఉద్యోగానికి
## చేసేది భారతీయుల
# డిజిటల్ అరెస్ట్



## కంబోడియా సైబర్ నేరగాళ్లతో కలిసి కేటుగాడిగా మారి

### సైబరాబాద్ పోలీసులకు అడ్డంగా బుక్కైన జగిత్యాల జిల్లా మేడిపల్లి వాసి

*శేరిలింగంపల్లి, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :*

ఉద్యోగం సద్యోగం జగిత్యాలలో లేకపోవడంతో కంబోడియాలో డాటా ఎంట్రీ ఉద్యోగాన్ని వెలగబెడదామని వెళ్లి సైబర్ నేరగాళ్ల సహవాసంతో కేటుగాడిగా మారి సైబరాబాద్ పోలీసులకు అడ్డంగా బుక్ అయిన ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సైబర్ క్రైమ్ డిసిపి టి. సాయి మనోహర్ వెల్లడించిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన గాజర్ల రా అవినాష్(26) అనే వ్యక్తి డేటా ఎంట్రీ ఉద్యోగం నిమిత్తం కంబోడియా వెళ్లి, అక్కడ అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాతో చేతులు కలిపి భారతీయులను 'డిజిటల్ అరెస్ట్' పేరుతో నిలువునా ముంచుతూ సైబర్ నేరస్తుడిగా మారిపోయాడు. నిందితుడు తొలుత ఉద్యోగంకోసం కంబోడియా వెళ్లగా అక్కడ ఒక ముఠా ఒత్తిడి మేరకు సైబర్ మోసాల్లోకి దిగాడని, ఆ తర్వాత లాభాల ఆశతో స్వయంగా పోలీసు అధికారుల అవతారమెత్తి బాధితులకు బెదిరింపు కాల్స్ చేస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని పోలీసులు వెల్లడించారు. బాధితులను భయభ్రాంతులకు గురిచేసి ములే బ్యాంక్ ఖాతాల ద్వారా నిందితుడు సుమారు 24 లక్షల రూపాయలమేర డిజిటల్ అరెస్ట్ వ్యవహారాల ద్వారా లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడి నుంచి ప్రస్తుతం 12లక్షల నగదుతోపాటు ఒక మొబైల్ ఫోన్, పాస్‌పోర్టును పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిసిపి వివరించారు. గుర్తుతెలియని వ్యక్తులు చేసే వీడియో కాల్స్, వాట్సాప్ ద్వారా, టెక్స్ట్ మెసేజ్ ల ద్వారా ఫోన్ లోకి వచ్చే ఏపికె ఫైల్స్, స్క్రీన్ షేరింగ్ యాప్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా పోలీసుల పేరుతో భయపెడితే తక్షణమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని డిసిపి టి. సాయి మనోహర్ సూచించారు.



## అత్యధిక జనాభా వర్గంగా
# ముదిరాజ్‌లు

- కులగణన ద్వారా ముదిరాజ్ సమాజానికి సరైన గుర్తింపు
- చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హర్షం



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ముదిరాజులను అత్యధిక జనాభా వర్గంగా ప్రకటించడం చారిత్రా త్మకమని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కోకాపేటలోని ముదిరాజ్ ఆత్మగౌరవ భవన స్థలం వద్ద తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుల గణన ద్వారా ముదిరాజ్ సమాజానికి సరైన గుర్తింపు లభించిందని, ఇది సంవత్సరాల ఆశలకు నాంది పలికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల మేరకు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కులగణన పూర్తి చేసి అధికారికంగా వివరాలు ప్రకటించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో ముదిరాజులను బీసీ-డి నుంచి బీసీ-ఏ కేటగిరీకి మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణనలో కీలక పాత్ర పోషించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ గౌడ్‌లను ఆయన అభినందించారు. ముదిరాజ్ సమాజం ఐక్యంగా ఉంటే విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధ్యమని, పూలే, అంబేద్కర్ చూపిన సామాజిక న్యాయం మార్గంలో ముందుకు సాగాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో బి. వెంకటేష్ ముదిరాజ్, మాజీ ఐఏఎస్ జగన్మోహన్ ముదిరాజ్, తలారి మల్లేష్ ముదిరాజ్, చొప్పరి శంకర్, పిట్ల మోహన్, బలరాం ముదిరాజ్ తదితర నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కులస్థులు పాల్గొన్నారు.

## ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పరిధిలో అవసరమున్న ప్రాంతాల్లో అండర్‌పాస్‌ల ఏర్పాటుపై ఢిల్లీలో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు చేవెళ్ల కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి చర్చించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమస్యలను వివరించిన నాయకులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని కోరారు. ప్రమాదాల నివారణతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం మెరుగుపడేందుకు అండర్‌పాస్‌లు కీలకమని వారు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మల్గారి జనార్దన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, షాబా దర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, పోలీసు రామ్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, సర్పంచ్ లు ప్రభాకర్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, లోంక శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు ప్రభాకర్, మధుసూధన్ గుప్తా, మంగలి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడితే రూ. 25 వేల ప్రోత్సాహకం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం కీలకం
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోతే ప్రాణాలు పోతాయి
- ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలి

లోపలి పేజీలో

# 60 ఏండ్ల ఆకాంక్షను అవమానపరిచిన బీజేపీ

- తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య భేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దగ్ధం
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్





**బోడుప్పల్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :**

ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో ధర్నా చౌక్ వద్ద పార్లమెంట్ లో తెలంగాణ విభజనను పాకిస్థాన్ తో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ విభజనను భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వ్యాఖ్యలను ఆయన అత్యంత బాధ్యతారాహిత్యంగా, అవమానకరంగా, అగౌరపరుస్తూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించేలా ఉన్నవని,తెలంగాణ రాష్ట్రం అనేది దశాబ్దాల పాటు సాగిన పోరాటాలు, త్యాగాలు, ఆత్మ బలిదానాలు,ప్రజాస్వామ్య ఉద్యమాల ఫలితం గా ఏర్పడింది.అటువంటి చారిత్రక, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను భారత్-పాకిస్తాన్ విభజన వంటి బాధాకరమైన, హింసాత్మక ఘటనతో పోల్చడం వాస్తవాల కు విరుద్ధమే కాకుండా అత్యంత అవమానకరం అని తెలియజేయడం జరిగింది. తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీల మౌనశీ దేనికి సంకేతం అని, ఇంకా గుజరాత్ వారికి బానిసలుగా ఉంటారా? అని అడుగుతున్నాం. "తెలంగాణ గౌరవాన్ని అవమానించినప్పుడు వారికి సిగ్గు అనిపించదా? మాట్లాడే ధైర్యం కోల్పోయారా?" అని ప్రశ్నిస్తున్నాం. ఇది బీజేపీ తెలంగాణ ఉద్యమాన్ని తక్కువ చేసి చూసిన మొదటి సందర్భం కాదని ప్రజల ముందు తెలంగాణ ఏర్పాటుకు క్రెడిట్ తీసుకుంటామని చెప్పుకుంటున్న బీజేపీ నాయకులు, రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన సమయంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారని,కావున తేజస్వి సూర్య తక్షణమే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం, ఇలాంటి సందర్భాల్లో రాష్ట్రంలోని ప్రజాస్వామ్య శక్తులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఇలాంటి అవమానకర వ్యాఖ్యలను ఖండించి, తెలంగాణ గౌరవం మరియు చరిత్రను రక్షించేందుకు ఐక్యంగా నిలవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, కృష్ణ, శ్రీహరి, సిద్దు, చింటూ, గోపి ,అరవింద్ ,మహేష్, ఆకాష్, విక్రమ్, ప్రవీణ్,సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గు 17 మంది యువకులపై అక్రమ కేసులు కొట్టివేత




**కొందుర్గు, ఏప్రిల్ 17 జనంసాక్షి** సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తితే అక్రమ కేసులతో అణచివేయలేరని షాద్‌నగర్ కోర్టు తీర్పుతో మరోసారి రుజువైంది. కొందుర్గు మండల కేంద్రంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేసినందుకు, రవాణా సౌకర్యాలకు ఆటంకం కలిగించారనే నెపంతో 17 మంది యువకులపై మోపిన అక్రమ కేసును షాద్‌నగర్ మేజిస్ట్రేట్ కొత్త రవి నేతృత్వంలో కొట్టివేశారు. కొంతకాలం క్రితం కొందుర్గు మండల కేంద్రంలో బస్టాండ్ లో మూత్రశాలలు మంచినీటి వంటి మౌలిక సదుపాయాల లేమిపై స్థానిక యువత శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. అయితే, ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, నాటి యంత్రాంగం ఆ యువతపై 'రవాణాకు అంతరాయం కలిగించారనే' అభియోగంతో 2017 సంవత్సరంలో కేసు నమోదు చేసింది. ఈ అక్రమ కేసుల వల్ల యువకులు గత కొంతకాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన షాద్‌నగర్ మేజిస్ట్రేట్ కొత్త రవి, యువకుల వైపు ఉన్న ధర్మాన్ని గుర్తించారు. సదరు 17 మంది యువకులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసును కొట్టివేశారు.హర్షం వ్యక్తం చేస్తున్న యువత న్యాయస్థానం తీర్పుతో కొందుర్గు మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. "మేము అడిగింది మా ఊరి అభివృద్ధి మాత్రమే.. మాపై పెట్టిన అక్రమ కేసులు ఈరోజుతో తొలగిపోవడం సంతోషంగా ఉంది. న్యాయం గెలిచింది" అని యువకులు ఆనందం వ్యక్తం చేశారు. నిరుపేద యువతకు అండగా నిలిచిన న్యాయ వ్యవస్థకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## తేజస్వీ సూర్య పార్లమెంటు సాక్షిగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలి



**సికింద్రాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ తో పోల్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యని వెంటనే పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని తెలంగాణ జాగృతి స్టేట్ సెక్రటరీ కందుల మధు, టీజేఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుమ్మడి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య వాఖ్యలను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద కందుల మధు, గుమ్మడి క్రాంతి కుమార్, సాయినేత, మంతెన మధు ఆధ్వర్యంలో పిండ ప్రధానం చేశారు. వారిని అడ్డుకున్న ఓయూ పోలీసులు అదుపులోకి తీసుకొని పీఎస్ కు తరలించారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు మాట్లాడుతూ.. పార్లమెంట్లో డీలిమిటేషన్ పై చర్చ జరగకుండా పార్లమెంటును పక్క ద్రోవ పట్టించడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల విషమ కక్కరాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలు, ఎంతోమంది అమరులై సాధించిన తెలంగాణ రాష్ట్రంపై అనుచిత వాక్యలు చేయడం సిగ్గు చేటన్నారు. తక్షణమే తేజస్వి సూర్య తెలంగాణ సమాజానికి పార్లమెంటు సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో భౌతిక దాడులు జరుగుతాయని హెచ్చరించారు.

# పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

### రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రాల సమర్పణ




**ఉప్పల్, ఏప్రిల్ 17 (జనం సాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల సంయుక్త చర్యా కమిటీ ఆధ్వర్యంలో వివిధ డిమాండ్ల సాధన కోసం మండల, డివిజన్ కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ సేవల సంఘం ప్రధాన కార్యదర్శి బిక్షం ఆధ్వర్యంలో నాయకులు ఉప్పల్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ తహశీల్దార్ శ్రీ పూల్ సింగ్ చౌహాన్ గారికి వినతిపత్రం సమర్పించి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం నాయకులు, తెలంగాణ పబ్లిక్ యుటిలిటీస్ సర్వీసెస్ సంఘం ప్రతినిధులు, పెన్షనర్ల సంఘాల నాయకులు, వివిధ జేఏసీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పెన్షనర్ల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## చిల్కానగర్ డివిజన్‌లో సజావుగా మంచినీటి సరఫరా జరగాలి

### కాంగ్రెస్ నేత ములకలపల్లి రాజేష్ ముదిరాజ్



**ఉప్పల్, ఏప్రిల్ 17 (జనం సాక్షి):** చిల్కానగర్ డివిజన్‌లో ప్రజలకు నిరంతరంగా, సజావుగా మంచినీటి సరఫరా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు ఉప్పల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుప్రియను కలిసి డివిజన్‌లో నెలకొన్న నీటి సమస్యలను వివరించారు. ముఖ్యంగా అనియమిత సరఫరా, తాగునీటి కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై స్పందించిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుప్రియ, చిల్కానగర్ డివిజన్ పరిధిలో నీటి సరఫరాలో ఉన్న లోపాలను వెంటనే పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించి సజావుగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అక్కిటి ఆగం రెడ్డి, మల్కాజ్గిరి డిసిసి ప్రధాన కార్యదర్శి కొంపల్లి బాలరాజు, నల్లవల్లి మహేందర్, నారోజు రాధాకృష్ణ, సోను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబ్ బెదిరింపు



**ఉప్పల్, ఏప్రిల్ 17 (జనం సాక్షి):** నగరంలోని ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబ్ బెదిరింపు రావడంతో ప్రాంతంలో తీవ్ర కలకలం నెలకొంది. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ మెట్రో స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా బాంబ్ బెదిరింపులు చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించి మెట్రో స్టేషన్ పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలిస్తూ అనుమానాస్పద వస్తువుల కోసం శోధనలు నిర్వహించారు. ఈ సమయంలో ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ, కొంతసేపు స్టేషన్‌లో రాకపోకలను నియంత్రించారు. బాంబ్ బెదిరింపు సమాచారం వెలుగులోకి రావడంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సాధారణంగా రద్దీగా ఉండే ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో భయాందోళన వాతావరణం నెలకొంది. అయితే ప్రాథమిక తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించిన అనంతరం పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, బెదిరింపు ఫోన్ చేసిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు. కాల్ డేటా ఆధారంగా దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి తప్పుడు బెదిరింపులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించడమే కాకుండా, భద్రతా వ్యవస్థపై అనవసర ఒత్తిడి తీసుకువస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# అప్పుల బాధతో డ్రైవర్ ఆత్మహత్య



**శంషాబాద్,ఏప్రిల్17(జనంసాక్షి)** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అనుమానాస్పద మృతి కేసు నమోదైంది. ఇన్స్పెక్టర్ నరేందర్ ప్రకారం ఆర్‌బి నగర్‌కు చెందిన సబావత్ శంకర్ (38), వృత్తి డ్రైవర్, అప్పుల భారాన్ని తట్టుకోలేక ఈ నెల 2026న కిషన్‌గూడ గొల్లపల్లి రోడ్డులో గడ్డి మందు సేవించాడు.తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని మొదట శంషాబాద్ లిమ్స్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 16 సాయంత్రం మరణించాడు.ఈ ఘటనపై మృతుడి భార్య సబావత్ ధోళి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి మరణంపై ఎటువంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

# నార్సింగిలో కోదండరామాలయ ప్రతిష్టాపన



**రాజేంద్రనగర్, ఏప్రిల్17(జనంసాక్షి)** నార్సింగి మండలం గండిపేట్ పరిధిలోని ఉప్పల్‌గూడ, మై హోం అవతార్ రోడ్డులో ఉన్న సంకటహరణ శ్రీ హనుమాన్ దేవస్థానంలో శ్రీ సీత లక్ష్మణ హనుమ సమేత శ్రీ కోదండ రామచంద్ర స్వామి వారి నూతన దేవాలయం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు ఏప్రిల్ 20 నుండి 23 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ టి. అంజన్ కుమార్ గౌడ్ తెలియజేశారు. ఈ మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను దేవాలయ కమిటీ చైర్మన్, బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు డి. లక్ష్మీనారాయణ, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేష్, అధ్యక్షుడు ఏ. జైపాల్ రెడ్డి, దారు శ్రీనివాస్ తదితరులు గోల్కొండ జిల్లా ఇన్‌చార్జ్ వై. శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పెంచిన ఫీజులు తగ్గించాలంటూ తల్లిదండ్రుల ఆందోళన



**ఉప్పల్/రామాంతపూర్, ఏప్రిల్ 17 (జనం సాక్షి):** రామాంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అకస్మాత్తుగా భారీగా పెంచిన ఫీజులకు నిరసనగా విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ వెంటనే బయటకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్కూల్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తల్లిదండ్రులను అడ్డుకున్నారు. తల్లిదండ్రుల కథనం ప్రకారం, స్కూల్ యాజమాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఫీజులను గణనీయంగా పెంచిందని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 84 శాతం ఫీజులు పెంచగా, 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు దాదాపు 140 శాతం వరకు పెంచినట్లు తెలిపారు. ఇంత భారీగా ఫీజులు పెరగడం తమకు భరించలేని భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫీజుల పెంపు వల్ల మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇప్పటికే పెరిగిన జీవన వ్యయాల మధ్య పిల్లల చదువు ఖర్చులు మరింత పెరగడం ఆందోళన కలిగిస్తున్నదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కొందరు తల్లిదండ్రులు మాట్లాడుతూ, "ఇలాంటి పెంపులను మేము ఎలా భరించగలం? మా పిల్లల చదువులు ఆగిపోవాల్సిన పరిస్థితి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలని, పాత ఫీజులే కొనసాగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. లేకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. "ప్రిన్సిపాల్ బయటకు రావాలి... యాజమాన్యం స్పందించాలి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. తల్లిదండ్రులను రోడ్డుపై నుంచి తొలగిస్తూ, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్యాయంగా ఫీజులు పెంచే యాజమాన్యాలపై చర్యలు తీసుకుని, విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

### కుల గణన నివేదిక ఆధారంగానే మాదిగలకు

# 11శాతం రిజర్వేషన్ కల్పించాలి

**రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఏకైక కులం మాదిగలు : డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 17(జనంసాక్షి):** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఏకైక కులం మాదిగలు అంటూ మంద కృష్ణ మాదిగ చేస్తున్న ప్రకటన సత్యమని కుల గణన రిపోర్ట్ రుజువు చేసిందని ఎమ్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదికలో మాదిగల జనాభా 10.3 % గా తేలిందని దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎమ్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సోమశేఖర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగలు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చే సమయంలోనే 9% రిజర్వేషన్ వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ఈరోజు వరకు పోరాడుతున్నాడని చెప్పారు. ఇప్పుడు వచ్చిన కుల గణన రిపోర్ట్ ద్వారా మాదిగల జనాభా శాతం గణంకాలతో సహా బుజువైందని అన్నారు. ఇప్పుడైనా రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు తెచ్చుకొని న్యాయం చేయాలను కోరారు. మంద కృష్ణ మాదిగ జనాభా ప్రకారం మాదిగలకు 11% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే.. ముఖ్యమంత్రి మెప్పు కోసం కొంత మంది జాతి ద్రోహులు మాదిగ మేధావుల ముసుగులో 9% రిజర్వేషన్లను స్వాగతించి తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఓయూ లో పిహెచ్‌డి అడ్మిషన్ల భర్తీ ప్రక్రియలో సీటు మ్యాట్రిక్స్ విధానంతో మాదిగ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్న నోరు మెదపని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జాతి ద్రోహులని అన్నారు. రేవంత్ రెడ్డి ఇలాంటి ద్రోహులను ప్రోత్సహిస్తే తన రాజకీయ ఉనికికే ప్రమాదమని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన కులగణన



నివేదిక కూడా తప్పుడు తడకగా ఉన్నదని మాదిగల జనాభా ఉన్న దానికన్నా తక్కువగా చూపెట్టారని 2011 జనాభా లెక్కల్లోనే సింగిల్ కులంగా దాదాపు 33 లక్షలు ఉన్న మాదిగలు ఇప్పుడు కేవలం 36 లక్షలపైన మాత్రమే చూపెట్టడం మాదిగల జనాభా సంఖ్యను తగ్గించి చూపెట్టారని అన్నారు. రెడ్డి కుల జనాభా సంఖ్యను మాత్రం గణనీయంగా పెంచుకొని చూపెట్టుకున్న వాళ్లు మాదిగ ఉన్న జనాభాను మాత్రం తక్కువ చేసి చూపెట్టారని వాస్తవ రిపోర్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ప్రభుత్వరంగ నియామకాల్లో 11% వాటా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ సీనియర్ నాయకులు వీరపాకుల పరుశరామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2 నాటికి పీఆర్సీ ప్రకటించాల్సిందే

- పెండింగులో ఉన్న 5 డీఏలను వెంటనే విడుదల చేయాలి
- రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు వెంటనే క్లియర్ చేయండి
- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించండి
- పిఆర్‌టియు పెద్దేముల్ మండల శాఖ అధ్యక్షుడు పోల నవీన్ కుమార్



**పెద్దేముల్ ఏప్రిల్17(జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి జూన్ 2 వరకు గడువు ఇస్తున్నట్లు పెద్దేముల్ మండలం.పిఆర్ టి యు మండల శాఖ అధ్యక్షుడు పోల,నవీన్ కుమార్, కార్యదర్శి బక్కవెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు టీజీఈజేసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి మండల తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. జూన్ 2 వరకు రావాల్సిన 2వ పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దాంతోపాటు పెండింగులో ఉన్న 5 డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దు చేసి ఓపీఎస్(ఓల్డ్ పెన్షన్ స్కీం) విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మా డిమాండ్ల సాధన కోసం పోరాట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు కొనసాగుతామని తెలిపారు కార్యక్రమంలో పాల్గొన్న వారు. ఎంపీఓ రతన్ సింగ్ ఉపాధ్యాయులు బందప్ప.రవి కాంత్ రెడ్డి, ఫక్రుజమా,అనూష,రవి,యాదగిరి, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది మహేష్ కుమార్,ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది గీత,రఘు, ఎంఆర్సి సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ప్రేమియా అకాడమీలో 100 శాతం ఉత్తీర్ణత

**ఖైరతాబాద్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ప్రేమియా అకాడమీలో బోర్డు పరీక్షలకు హాజరైన 36 మంది విద్యార్థులు సంస్థకు అపారమైన గౌరవాన్ని తెచ్చి పెట్టారని విద్య సంస్థల ఫౌండర్ సిందూరి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తృప్తి రావు తోకలసి పాఠశాల సగటు ఉత్తీర్ణత శాతం ఆకట్టుకునేలా 82 శాతంగా ఉందన్నారు. ఫలితాలలో షేక్ రిదా 97.4 శాతం అద్భుతమైన స్కోరుతో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. అధిక మార్కులు సాధించిన వారిలో ఎం.అనిరుధ్ 95 శాతం, హిమాంశు గోయల్ 94 శాతం సాధిం చగా, హరిణి అల్వాలా, ఉజైర్ మాలిక్, అబ్దుల్ మన్నన్, రియాంకా యద్వాద్కర్‌తో సహా పలువు రు విద్యార్థులు 90 శాతం మార్కును దాటారని తెలిపారు. సబ్జెక్టుల వారీగా సాధించిన అత్యధిక స్కోర్లు విద్యార్థుల ప్రతిభలోని విస్తృతిని మరిం తగా చాటి చెబుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ లో వందకు వంద మార్కులు రిదా, ముజ్జుద్దీన్ అహ్మద్ ఇంగ్లీష్ 98 రిదా, శ్రీకృతి గువ్వ, హరిణి అల్వాల, మన్నన్ హిందీ 96 రిదా సైన్స్ 98 రిదా గణితం 93 హిమాంశు, అనిరుధ్ సాంఘిక శాస్త్రం 96 అనిరుద్దె లుగు 94 అనిరుధ్ రెడ్డి సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు తమ విద్యాసంస్థకు గర్వకారణం అన్నారు. హెడ్‌మిస్ట్రెస్ సునీత సరిపల్లి తమ ఉపాధ్యాయ బృందానికి నిజమైన మార్గదర్శకులిగా వ్యవహరించారని తెలిపారు.



## కిస్మత్‌పూర్‌లో 19న హిందూ సమ్మేళనం

**రాజేంద్రనగర్, ఏప్రిల్17(జనంసాక్షి)** ఈ నెల 19న కిస్మత్ పూర్ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కిస్మత్ పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా హిందూ సమాజంలో ఐక్యత, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ కోసం ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో అవగాహన పెంపొందించి, ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. కిస్మత్ పూర్, పరిసర ప్రాంతాల ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## తెలంగాణ ప్రజలకి తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలి



**అబ్దుల్లాపూర్ మెట్టు, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనేది ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏండ్ల కల అలాంటి కల సాకరమైన సందర్భాన్ని గురువారం నాడు పార్లమెంట్ లో పాకిస్తాన్‌తో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకి వెంటనే క్షమాపణ చెప్పాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్ డిమాండ్ చేసారు. తెలంగాణ ప్రజలు తమ ఆత్మ గౌరవం కోసం, తమ అస్తిత్వం కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని 60 ఏండ్ల నుండి పోరాటాలు చేసి ఎంతో మంది ప్రాణాలు అర్పిస్తే ఈ రాష్ట్రం ఏర్పాటు అయింది అని అన్నారు. భూమీ, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటాన్ని త్యాగాల ద్వారా ఏర్పడ్డ రాష్ట్రాన్ని ఉద్దేశించి గతంలో ప్రధాని నరేంద్ర మోడీ సైతం అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. మతోన్మాద పార్టీ అయినా బీజేపీ ప్రతినిధులు తెలంగాణ ప్రాంతం, ప్రజలు, అమరుల త్యాగాలు అన్న ఏ మాత్రం గౌరవం లేదని అనేక సార్లు అవమానించారు అని గుర్తు చేశారు. తెలంగాణను తేజస్వి సూర్య అవమానించిన కూడా తెలంగాణ బీజేపీ ఎంపీలు కనీసం అభ్యంతరం చెప్పకపోవటం సిగ్గు చేటు అని మండిపడ్డారు.